సదరం గుర్తింపు కార్డు జారీకి యూడీఐడీ పోర్టల్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 1 : సదరం గుర్తింపు కార్డు జారీకి యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (ఎస్ఈఆర్‌పీ) సీఈవో దివ్య దేవరాజన్ తెలిపారు. శనివారం సదరం క్యాంపులు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై కలెక్టర్, డీఆర్‌డీవో, డీడబ్ల్యూవో, డీసీహెచ్ఎస్, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈవో మాట్లాడుతూ సదరం ధ్రువీకరణ దస్త్రాల జారీకి యూడీఐడీ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. మీసేవ, వీఎల్ఈ కేంద్రాల్లోనూ, యూడీఐడీ పోర్టల్, సొంత మొబైల్ ద్వారా రిజిస్ట్రేషన్ స్లాట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియ ఈనెల నుంచి అమల్లోకి వస్తుందని, 21 రకాల వైకల్యం కలిగిన వారు యూడీఐడీ కార్డును పొందవచ్చన్నారు. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసుకునే విధానంపై మీసేవ నిర్వాహకులకు శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. పీఎం కుసుం ప్రాజెక్టు కింద గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామీణ మహిళా సంఘాలను ప్రోత్సహించాలన్నారు. వీసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఆర్‌డీవో నర్సింహులు, జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

నిధులను వినియోగించుకోవాలి

- కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 1 : సమగ్ర శిక్ష ప్రాజెక్టు, పీఎంశ్రీ ద్వారా జిల్లాలోని పాఠశాలలకు మంజూరై నిధులను వందశాతం వినియోగించుకోవాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. శనివారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి పాఠశాల నిర్వహణ, భద్రత, ఆత్మ రక్షణ, యువ, పర్యావరణ క్లబ్‌లు, నిర్మాణ పనులకు మంజూరైన నిధులను ఖర్చు చేసి వినియోగించాలని ఆదేశించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. వేసవి కాలంలో తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, ఏఎంవో శ్రీనివాస్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయేందిరబోయి

గురుకులంలో ఘనంగా వార్షికోత్సవం

వార్షికోత్సవ వేడుకల్లో అధ్యాపక బృందంతో ఎస్పీ జానకి, ప్రిన్సిపాల్ వాణిశ్రీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, మార్చి 1 : మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం ధర్మాపూర్ సమీపంలోని రాంరెడ్డిగూడెం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ జానకి హాజరయ్యారు. మొక్కలు నాటి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే లక్ష్యం సాధించవచ్చన్నారు. విద్య, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం తదితర అంశాలపై విశదీకరిస్తూ బలహీనతలు మన జీవితాన్ని నిర్దేశించుకూడదని, కష్టపడి ముందుకు సాగాలని సూచించారు. మహిళా సాధికారత, సమాజంలో మహిళల పాత్ర, ఉద్యోగ అవకాశాలపై వివరించారు. సాంస్కృతిక, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాల్లో వన్‌టౌన్ సీఐ అప్పయ్య, ప్రిన్సిపాల్ వాణిశ్రీ, అధ్యాపక, ఉపాధ్యాయ బృందం, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

31 వరకు పోలీస్ యాక్ట్ అమలు

మహబూబ్‌నగర్, మార్చి 1 : జిల్లాల్లో శాంతి భద్రతల దృష్ట్యా ఈనెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ జానకి ఐపీఎస్ శనివారం ప్రకటనలో తెలిపారు. 30 పోలీసు యాక్టు 1861 అమలులో ఉన్నందునా జిల్లాలో సబ్ డివిజినల్ పోలీసు అధికారి లేదా పోలీసు ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపు, ధర్నాలు నిర్వహించరాదని, నిషేధిత ఆయుధాలైన కత్తులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, వంటి ఆయుధాలను వాడరాదని పేర్కొన్నారు. లౌడ్ స్పీకర్, డీజే లు వంటివి కూడా ఈ సమయంలో నిషేధమన్నారు. నియమాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 కింద శిక్షార్హులవుతారని ఎస్పీ పేర్కొన్నారు.

భూదాన్ భూమి స్వాధీనం చేసుకోవాలి

- కోర్టు ఆదేశాల మేరకు చర్యలకు సిద్ధమైన అధికారులు

జడ్చర్లటౌన్, మార్చి 1 : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 138 భూమిలో 2.10 ఎకరాల భూదాన్ భూమిని స్వాధీనం చేసుకోవాలని సీసీఎల్ఏ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే జడ్చర్ల మొదటి ఎమ్మెల్యే కొత్తకేశవులు తన సొంత పట్టాభూమిని భవిష్యత్ అవసరాల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల నిర్మాణం కోసం 1965లో 2.10 ఎకరాల తన సొంత భూమిని భూదాన్ యజ్ఞ బోర్డుకు దానం చేశారు. అప్పటి ప్రభుత్వం భూమిలేని వారికి భూదాన్ భూములను ఇచ్చే క్రమంలో సర్వేనెంబర్ 138లో కావేర మ్మపేటకు చెందిన చెన్నయ్యకు అసైన్‌మెంట్ ద్వారా 2.10 ఎకరాలు భూమిని పంపిణీ చేసింది. చెన్నయ్య మరణానంతరం ఆయన వారసులు ఈ భూదాన్ భూమిని అనుభవించే హక్కు ఉంటుంది, కానీ ఇతరులకు అమ్ముకునే హక్కు ఉండదు. కానీ కొందరు రియాల్టర్లు అధికారులతో కుమ్మకై 2024 ఏప్రిల్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఈ భూమిని ఇతరుల పేర రిజిస్ట్రేషన్ చేసి నాలా కన్వర్షన్ చేసుకున్నారు. ఈ క్రమంలో ఇదే సర్వే నెంబర్‌లో ఉన్న మిగతా పట్టాభూమి 14.22 ఎకరాల భూమిని ధరణి ప్రొహిబిటెడ్ (నిషేధిత భూమి)గా రావడంతో మిగతా పట్టాదారులు అప్రమత్తమై సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) కోర్టును సంప్రదించగా, సీసీఎల్ఏ కోర్టు విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ఎన్‌వోసీతో భూదాన్ భూమిని పట్టా భూమిగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తించి, భూదాన్ భూమిని ఇతరులకు అమ్మినందుకు గానూ అసైన్ పొందిన వారి హక్కులను రద్దు చేస్తూ, భూదాన్ భూమిని స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్, ఆర్డీవో, తాసీల్దార్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా రెవెన్యూ రికార్డుల్లో పట్టాభూమిగా నమోదైన వాటిని తొలగించి భూదాన్ భూమిగా రికార్డులో నమోదు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ విషయంపై జడ్చర్ల తాసీల్దార్ నర్సింగ్‌రావును వివరణ కోరగా సర్వేనెంబర్ 138లో 2.10 ఎకరాలు భూదాన్ భూమి ఉన్నట్లు సీసీఎల్ఏ కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, కోర్టు ఆదేశాల మేరకు భూదాన్ భూమి స్వాధీనం చేసుకోనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ నడిబొడ్డున్న దాదాపు రూ.5కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణదారుల నుంచి బయటపడడం పట్ల పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ భూమిలో రూరల్ పోలీస్‌స్టేషన్ గానీ, ఇతర రాత్ర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ఉపయోగపడనున్నట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

మరికల్, మార్చి 1 : రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని బీఆర్ఎస్ నాయకులు వీర బసంత్, రామస్వామి, కొండరెడ్డి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు నేటి వరకు రుణమాఫి కాలేదని, రైతు భరోసా ఈనెల చివరి వరకు అందుతుందో లేదో తెలియని పరిస్థితి ఏర్పాడిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నారాయణ, రాజరెడ్డి, రవి గౌడ్, వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి

నారాయణపేట, మార్చి 1 : జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ బుచ్చయ్య అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి కమిటీల నేతృత్వంలో మాదక ద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని మాగనూర్ ప్రాంతంలో గంజాయి సాగు జరుగుతుందనే సమాచారం ఉందని, వ్యవసాయశాఖ అధికారులు రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు మాదకద్రవ్యాల నిషేధంపై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాలన్నారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పేట డీఎస్పీ లింగయ్య, యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ బుచ్చయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. డ్రగ్స్ విక్రయదారులు యువతనే లక్ష్యంగా చేసుకొని తమ కార్యకలాపాలు కొనసాగిస్తారని, దీనిపై యువత చైతన్యం కలిగి ఉండాలన్నారు.

మన పరిసరాలలో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే 8712671111 లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1908కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, ఆర్డీవో రాంచందర్, డీఈవో గోవింద రాజన్, ఆర్టీవో మేఘాగాంధీ, ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సునీత తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు ఘన నివాళి

హన్వాడ : నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హన్వాడ/దేవరకద్ర/భూత్పూర్, మార్చి 1 : ఏబీసీడీ వర్గీకరణ కోసం ఆత్మబలిదానం చేసుకున్న మాదిగ అమరవీరులకు శనివారం మండల కేంద్రంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబుల య్య మాట్లాడుతూ అమరవీరుల త్యాగ ఫలితామే ఏబీసీడీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వర్గీకరణ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దేవరకద్ర మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దొబ్బలి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏబీసీడీ వర్గీకరణ కోసం ఆత్మబలిదానం చేసుకున్న మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. భూత్పూర్ పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అమరవీరులకు ఆ సంఘం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూత్పూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో కొండా లక్ష్మయ్య, బాలయ్య, నరేందర్, యాదయ్య, కిరణ్, గంగాయ్య, ఆంజనేయులు, బాలకిష్టయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రాములు, యాదయ్య, వెంకటయ్య, వీరస్వామి, యాదయ్య, కాన్షీరాం, వీరస్వామి, రాములు, అంజి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంటి వద్ద చదువుకోవాలి

అడ్డాకులలో సైన్స్ ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

- ఎంఈవో కురుమూర్తి

మూసాపేట(అడ్డాకుల), మార్చి 1 : విద్యార్థులు ప్రతి రోజు పాఠశాల వదిలి వెళ్లిన తర్వాత తమ ఇంటి వద్ద తప్పనిసరిగా చదువుకోవాలని, అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వారిని చదువుకునేందుకు ప్రోత్సహించాలని ఎంఈవో కురుమూర్తి సూచించారు. శనివారం అడ్డాకుల టాలెంట్ పాఠశాలలో సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేకంగా తయారు చేసిన పరికరాలను పరిశీలించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడ్డాకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, కరస్పాండెంట్ గోవర్ధన్‌చారి, అధ్యాపక బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఉదండాపూర్ పాఠశాలలో..

జడ్చర్ల, మార్చి 1 : మండలంలోని ఉదండాపూర్ గ్రామంలోని పాఠశాలను శనివారం ఎంఈవో మంజులాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోని 4, 5వ తరగతి విద్యార్థుల యొక్క గణిత సామర్థ్యాలను పరీక్షించారు. ఎఫ్ఎల్ఎన్, సీసీఈ, ఎండీఎం వంటి పనుల నిర్వాహణపై ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీవాణి, గౌతమి పాల్గొన్నారు.

మంచి నాయకుడిని కోల్పోవడం పార్టీకి లోటు

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్, మార్చి 1 : మంచి నాయకుడిని కోల్పోవడం ఎంతో బాధను కలిగిస్తుందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య మృతిచెందడంతో శనివారం భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీగా మండల అభివృద్ధికి ఎంతో పటుపడినట్లు తెలిపారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కొత్త శ్రీనివాస్‌గుప్తా, మక్తల్, మాగనూరు మండలాల అధ్యక్షులు మైపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డితోపాటు నాయకులు ఉన్నారు.

దత్తక్షేత్రంలో పూజలు..

తెలంగాణ, కర్ణాటక సరిహద్దులో గల క్రూమాపురం దత్తక్షేత్రంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, భరత్, నేతాజీ, ఈశ్వర్ యాదవ్, ఉమా శంకర్‌గౌడ్ ఉన్నారు.

నేడు యుద్ధభేరి.. చలో ధర్నా చౌక్

- టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 1 : ఈనెల 2వ తేదీన యూపీఎస్‌పై యుద్ధభేరిలో భాగంగా చలో ధర్నా చౌక్ (హైదరాబాద్ ఇందిరా పార్క్) కార్యక్రమం చేపడుతున్నట్లు టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో, మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో యుద్ధభేరి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా దాదాపు 2.50లక్షల మంది దశాబ్దకాలం గా పోరాటం చేస్తుంటే ప్రస్తుతం యూపీఎస్ పేరుతో ఉద్యోగులను మభ్య పెట్టేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తుందన్నారు. ఏప్రిల్ 1 నుంచి కేంద్రం అమలు చేయబోతున్న యూపీఎస్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు జీవితాలు మరింత దుర్భరమవుతాయని పేర్కొన్నారు. ఉద్యోగులకు భద్రత కల్పించని ఈ విధానాన్ని వెంటనే ఉప సంహరించుకోని 1980 పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం 8:45గంటలకు మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎల్లమ్మగుడి, జెడ్పీ మైదానం నుంచి బస్సులు బయలుదేరతాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై సీపీఎస్, యూపీఎస్‌లపై మనకున్న వ్యతిరేకతలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్‌కుమార్, సీపీఎస్ ఉద్యోగులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల వద్ద యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అబ్బుర పర్చిన విద్యార్థుల ప్రదర్శనలు

నవాబ్‌పేట, మార్చి 1 : మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో శనివారం నిర్వహించి విజ్ఞాన మేళా పలువురుని అబ్బురపర్చింది. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విజ్ఞాన మేళా కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు తమ సొంత మేధాశక్తితో వివిధ అకృతులు, ప్రదర్శనలు చేపట్టారు. ఫారెస్ట్ ఎనిమల్స్, చంద్రయాన్, మిస్సు ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్, మెట్రో, సోలార్ సిస్టమ్, ఇంటర్నల్ ఆర్గాన్స్, గ్లోబల్ హార్మింగ్, షెప్స్‌హౌజ్, మెజర్‌మంట్స్, ప్రకృతి విపత్తులు, చారిత్రాత్మక, పురాతన కట్టడాలు, సర్వమతాల పండుగలు, ఎర్రకోట, ఇండియాగేట్, చార్మినార్, తాజ్‌మహల్ లాంటి పురాతన కట్టడాలను విద్యార్థులు స్వతహాగా తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భానుప్రతాప్, ప్రిన్సిపాల్ రూపవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలు చేపడుతున్న విద్యార్థులు

డాక్టరేట్ అందుకున్న శాంతానంద్ పురోహిత్

డాక్టరేట్ అందుకుంటున్న శాంతానంద్ పురోహిత్

నారాయణపేట టౌన్, మార్చి 1 : పట్టణానికి చెందిన శక్తిపీఠం వ్యవస్థాపకుడు శాంతానంద్ పురోహిత్ శనివారం ఢిల్లీలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. శక్తిపీఠం స్వామిజీ శాంతానంద్ పురోహిత్ చేసిన ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక సేవలను గుర్తించి ఆధ్యాత్మిక విభాగంలో అమెరికన్ మేనేజ్మెంట్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా శక్తిపీఠం ట్రస్ట్ సభ్యులు శాంతానంద్ పురోహిత్‌ను అభినందించారు.

స్వచ్ఛతపై ప్రతిఒక్కరూ దృష్టి పెట్టాలి

భూత్పూర్, మార్చి 1 : చుట్టూ పరిసరాల స్వచ్ఛతపై ప్రతిఒక్కరూ దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ కోరారు. శనివారం మున్సిపాలిటీలోని 4వ వార్డులో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి పట్టణంలోని ఆయా వార్డుల్లో చెత్తా చెదారం ఉంటే ఆ వార్డు ఆఫీసర్, సిబ్బంది పై చర్యలు ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సుజాత, ఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ధన్వాడ/జడ్చర్ల/నవాబ్‌పేట/మక్తల్, మార్చి 1 : మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం స్వయం స్వపరిపాలన దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ తోటి విద్యార్థులకు ఆయా సబ్జెక్ట్‌ల్లో పాఠాలను బోధించారు. అనంతరం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ధన్వాడ : కొండపూర్‌లో ఉపాధ్యాయులైన విద్యార్థులు

మహిళా మృతి కేసును ఛేదించిన పోలీసులు

భూత్పూర్‌లో నిందితుడిని అరెస్టు చేసిన సీఐ రామకృష్ణ

భూత్పూర్, మార్చి 1 : గత నెల26వ తేదీన జరిగిన అనుమానాస్పదంగా మృతి చెందిన అనేగాళ్ల రంగమ్మ (50) హత్య కేసును భూత్పూర్ పోలీసులు శనివారం ఛేదించినట్లు భూత్పూర్ సీఐ రామకృష్ణ మీడియాకు శనివారం వెల్లడించారు. ఈ ఘటనకు సీఐ తెలిసిన వివరాల మేరకు మండలంలోని కొత్త మొల్గర గ్రామానికి చెందిన మృతురాలు రంగమ్మకు భూత్పూర్‌లో ఫిబ్రవరి 19వ తేదీన జరుగుతున్న శ్రీమునిరంగస్వామి జాతరలో నిందితుడు మండల కేంద్రం గడ్డం రాజుకు పరిచయమైంది. ఆమె కల్లుకు బానిసైన విషయాన్ని గమనించిన గడ్డం రాజు తన కోరిక తీర్చమని కోరాడు. ఇందుకు ఆమె రూ.300లు డిమాండ్ చేయగా, ఇస్తానని మాయమాటలు చెప్పి రాత్రి 9:30గంటలకు జాతరలో నే చెట్ల పొదల్లో వెళ్లి కోరిక తీర్చుకున్నాడు. అనంతరం ఆమె రాజును డబ్బులు అడుగగా ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. దీంతో ఆమె రాజు సెల్‌ఫోన్‌ను తీసుకొని డబ్బులు ఇచ్చేవరకు నీ ఫోన్ ఇవ్వనని చెపింది. తిరిగి అదే నెలలో 25వ తేదీన జాతరలో రాజు, రంగమ్మను కలిసి తన సెల్‌ఫోన్ ఇవ్వమని అడిగాడు. ఇందుకు ఆమె డబ్బులు ఇస్తేనే ఫోన్ ఇస్తానని తేల్చి చెప్పింది. 26వ తేదీన తెల్లవారు జామునా 3:30గంటలకు రంగమ్మ పడుకొని ఉండగా రాజు గమనించి పెద్ద రాయితో మొఖంపై, ఎడమ కాలుపై గట్టిగా కొట్టాడు. దీంతో గాయాలతో కొట్టుమిట్టాడుతున్న ఆమెను కొందరు వ్యక్తులు దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ 26వ తేదీన ఉదయం 8గంటలకు మృతి చెందింది. ఈ సందర్భంగా ఎస్సై చంద్రశేఖర్, సిబ్బందిని అభినందించారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు పంపారు.

వ్యక్తి అదృశ్యం

నవాబ్‌పేట, మార్చి 1 : మండలంలోని కారూర్ గ్రామానికి చెందిన బండారి శేఖర్ అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు బండారి శేఖర్ భార్య చంద్రకళ ఇటీవల ఇంట్లో గొడవపడి తన తల్లిగారి ఊరికి వెళ్లింది. భార్యను తీసుకువస్తానని ఫిబ్రవరి 24వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన శేఖర్ తిరిగి కారూర్‌కు రాలేదు. కుటుంబ సభ్యులు వారి బంధువుల ఇండ్ల వద్ద వెతికినా అతడి ఆచూకీ లభించలేదన్నారు. తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

SWAMI VIVEKANANDA DEGREE & PG COLLEGE
(Affiliated to Palamuru University)
BP Complex, Mahaboobnagar, Ph: 08542-251851,251333
EMPLOYMENT NOTIFICATION
Applications are invited for ADDITIONAL TEACHING STAFF to teach PG & Degree in Telugu & English media in the following subjects.
PRINCIPAL - 1 (Preferred Ph.D. Candidates)
PG: M.Sc. Microbiology-4, Botany-4, Zoology-3, Org.Chem.-3
UG: Maths-2, Chemistry-2, Botany-2, Zoology-2, Applied Nutrition-1, Microbiology-2, Comp.Science-4, Statistics-1, Physics-1, Commerce-4, English-4, Telugu-1, Hindi-1, Urdu-1, Arabic-1, Sanskrit-1, Sociology-1, History-2, Pol.Science-2, Economics-2, Business Administration-3.
1. Experienced Candidates will be Preferred.
2. For PG courses Ph.D/NET/SET candidates will be preferred.
3. Selections will be as per norms of Palamuru University.
Apply with a set of xerox copies on or before: 10-03-2025
Contact: 9391022328, 9618995768
E-mail: svdemhor@gmail.com
Secretary/Correspondent